# సంపాదకీయం

## పిల్లల చేతిలో స్మార్ట్‌ఫోన్ స్వేచ్ఛా? ప్రమాదమా?

**నేటి ఆధునిక ప్రపంచంలో ఆన్‌లైన్ ప్రపంచంలో ఎంత స్వేచ్ఛ ఇవ్వాలి?**
**ఎక్కువసేపు స్క్రీన్లకు అతుక్కుపోయేలా ప్లాట్ ఫారమ్‌ల మాయాజాలం?**
**మితిమీరిన నియంత్రణ కంటే స్వేచ్ఛాయుత సంభాషణే మేలు!**
**ఆన్‌లైన్ స్వేచ్ఛ ఇవ్వాలనే నిర్ణయం వయస్సును బట్టి కాదు. ప్రవర్తనను బట్టి!**
**పేరెంటల్ కంట్రోల్ యాప్‌లు, సాంకేతిక నిఘా కంటే నమ్మకమే ముఖ్యం**



నేటి ఆధునిక ప్రపంచంలో పదేళ్ల వయసు పిల్లల చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండటం సర్వసాధారణమై పోయింది. గేమింగ్ యాప్‌లు, యూట్యూబ్, మెసేజి ంగ్ ప్లాట్‌ఫారమ్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్, మరియు పాఠశాలల డిజిటల్ పరికరాలు నేడు పిల్లల దైనందిన జీవితంలో ఒక భాగమైపోయా యి. అయితే, ఈ డిజిటల్ అరణ్యంలో పిల్లలకు ఎంతవరకు స్వేచ్ఛ ఇవ్వాలి, ఏ వయస్సులో ఇవ్వాలి అనేది నేటి తల్లిదండ్రులను వేధిస్తున్న అతిపెద్ద ప్రశ్న. ఇది కేవలం స్క్రీన్ సమయానికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, పిల్లల మానసిక భద్రత, డిజిటల్ అవగాహనకు సంబంధించిన తీవ్రమైన సమస్య అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఎక్కువసేపు స్క్రీన్లకు అతుక్కుపోయేలా ప్లాట్ ఫారమ్‌ల మాయాజాలం?**

సాంకేతికత ఆధారిత ఆన్‌లైన్ విద్యపై పనిచేస్తున్న ప్రముఖ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ రోజుల్లో పిల్లలు ఒకేసారి అనేక డిజిటల్ పరికరాలను ఉపయోగిస్తున్నారు. తల్లిదండ్రులు కేవలం ఒక మొబైల్ స్క్రీన్‌ను మాత్రమే కాకుండా, అనేక యాప్‌లు, ఆన్‌లైన్ కమ్యూనిటీలతో నిండిన ఒక సంక్లిష్టమైన ప్రపంచాన్ని పర్యవేక్షించాల్సి వస్తోంది. పిల్లలను ఎక్కువసేపు స్క్రీన్లకు అతుక్కుపోయేలా చేసేందుకే అనేక ప్లాట్‌ఫారమ్‌లు డిజైన్ చేయడం జరిగింది. అందువల్ల, నేటి డిజిటల్ యుగంలో తల్లిదండ్రుల బాధ్యత మునుపెన్నడూ లేనంతగా పెరిగిపోయింది.

**మితిమీరిన నియంత్రణ కంటే స్వేచ్ఛాయుత సంభాషణే మేలు!**

అయితే, పిల్లలకు తగినంత ఆన్‌లైన్ స్వేచ్ఛ ఇవ్వడం వల్ల కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఇంటర్నెట్ అనేది పిల్లలకు కొత్త సమాచారాన్ని, సృజనాత్మకతను, వినూత్న అభ్యాస అవకాశాలను అందిస్తుంది. జర్నల్ ఆఫ్ కమ్యూనికేషన్ (2017)లో ప్రచురితమైన ఒక సమగ్ర యూరోపియన్ అధ్యయనంలో ఎనిమిది దేశాలకు చెందిన 6,400 మంది పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. తమ పిల్లలపై కేవలం కఠినమైన ఆంక్షలు విధించకుండా, వారితో డిజిటల్ ప్రపంచం గురించి స్వేచ్ఛగా మాట్లాడే తల్లిదండ్రుల పిల్లలే మెరుగైన డిజిటల్ నైపుణ్యాలను, సురక్షితమైన ఆన్‌లైన్ అలవాట్లను పెంపొందించుకున్నారని ఈ అధ్యయనం తేల్చింది. మితిమీరిన నియంత్రణలు పిల్లల అభ్యాస సామర్థ్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయని పరిశోధకులు వెల్లడించారు.

**ఆన్‌లైన్ స్వేచ్ఛ ఇవ్వాలనే నిర్ణయం వయస్సును బట్టి కాదు. ప్రవర్తనను బట్టి!**

పిల్లలకు ఆన్‌లైన్ స్వేచ్ఛ ఇవ్వాలనే నిర్ణయం కేవలం వారి వయస్సు మీద మాత్రమే ఆధారపడి ఉండకూడదు. ఒకే వయస్సు ఉన్న ఇద్దరు పిల్లల అవగాహన, బాధ్యతాయుత ప్రవర్తనలో చాలా తేడాలు ఉండవచ్చు. పిల్లలు తాము ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారో? తల్లిదండ్రులతో బహిరంగంగా చర్చిస్తే, ఏదైనా అనుచితమైన కంటెంట్ చూసినప్పుడు భయపడకుండా చెబితే, ఇంట్లో విధించిన నియమాలను పాటిస్తే వారు మరింత డిజిటల్ స్వేచ్ఛను తట్టుకోగలరని అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ పిల్లలు తమ ఆన్‌లైన్ కార్యకలాపాలను దాచడం ప్రారంభించినా, ఫోన్ లాక్కున్నప్పుడు విపరీతమైన చిరాకు, కోపం ప్రదర్శించినా, లేదా స్క్రీన్ సమయాన్ని అస్సలు నియంత్రించుకోలేకపోతే.. వారికి మరిన్ని పరిమితులు అవసరమని గుర్తించాలి.

**పేరెంటల్ కంట్రోల్ యాప్‌లు, సాంకేతిక నిఘా కంటే నమ్మకమే ముఖ్యం**

కంప్యూటర్స్ ఇన్ హ్యూమన్ బిహేవియర్ జర్నల్ (2023) లో దాదాపు 3,000 మంది తల్లిదండ్రులు, పిల్లలపై జరిగిన ఒక అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. తమ పిల్లలతో ప్రతిరోజూ బహిరంగంగా మాట్లాడే తల్లిదండ్రులకు, వారి పిల్లల నిజమైన ఆన్‌లైన్ జీవితం గురించి కచ్చితమైన అవగాహన ఉంటోంది. కానీ, కేవలం పేరెంటల్ కంట్రోల్ యాప్‌లు, సాంకేతిక నిఘాపైనే ఆధారపడే తల్లిదండ్రులు తరచూ భ్రమల్లోనే ఉండిపోతున్నారు.
ఏదైనా టెక్నాలజీ యాప్ కంటే కూడా పిల్లలతో నమ్మకమైన, స్నేహపూర్వక బంధాన్ని ఏర్పరచుకోవడమే వారిని డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉంచడానికి ఉన్న ఏకైక మార్గమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# ప్రకృతి వ్యవసాయాన్ని కాపాడుకుందాం... భూమిని రక్షిద్దాం!

**రసాయనాల మోజులో నేల సారాన్ని కోల్పోతున్న రైతాంగం**
**పూర్వీకుల సేంద్రియ వ్యవసాయమే భావితరాలకు భరోసా**
**రైతులు ఇప్పటికైనా మేల్కోవాలని ప్రకృతి వ్యవసాయ నిపుణుల పిలుపు**

వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే కాదు... అది ప్రకృతితో మనిషి పెనవేసుకున్న అనుబంధం. వేల ఏళ్లుగా మన పూర్వీకులు ప్రకృతిని ఆరాధిస్తూ, నేలను తల్లిగా భావిస్తూ వ్యవసాయం చేశారు. పశువుల ఎరువు, జీవామృతం, ఘనజీవామృతం, పచ్చిరొట్ట వంటి సహజ పద్ధతులతో భూమి సారాన్ని కాపాడుతూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని సమాజానికి అందించారు. అందుకే అప్పట్లో భూమి సారవంతంగా ఉండేది... పంటలు నాణ్యంగా పండేవి... ప్రజల ఆరోగ్యం కూడా మెరుగ్గా ఉండేది.

**రసాయనాల వినియోగం వల్ల నేల భూసారం కోల్పోతుంది**

కానీ కాలక్రమేణా వ్యవసాయ రంగంలో రసాయనాల వినియోగం విపరీతంగా పెరిగింది. అధిక దిగుబడుల ఆశతో రైతులు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, కలుపు నివారణ మందులపై పూర్తిగా ఆధారపడుతున్నారు. మొదట్లో ఇవి ఎక్కువ దిగుబడులు ఇచ్చినట్లు కనిపించినా, నేడు అదే భూమి సారాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. నేలలోని సూక్ష్మజీవులు నశించి, భూమి తన సహజ శక్తిని కోల్పోతోంది. ప్రతి ఏడాది ఎరువుల మోతాదు పెరుగుతున్నా దిగుబడులు మాత్రం ఆశించిన స్థాయిలో రావడం లేదు.

**రసాయనాల వల్ల నేల, మనిషి ఆరోగ్యం క్షీణిస్తుంది**

రసాయనాల ప్రభావం కేవలం భూమిపైనే కాదు... మన ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. పంటల్లో మిగిలిపోయే రసాయన అవశేషాలు ఆహారం ద్వారా మన శరీరంలోకి చేరి అనేక దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవైపు రైతు పెట్టుబడులు పెరుగుతుంటే, మరోవైపు నేల సారం తగ్గిపోవడం, నీటి కాలుష్యం పెరగడం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వంటి సమస్యలు తీవ్రమవుతున్నాయి.

**ప్రచారాలకు ఆకర్షితుడైన రైతు**

'దేశానికి వెన్నెముక రైతు' అని ప్రతి ఒక్కరూ చెబుతారు. కానీ నేడు ఆ రైతే కంపెనీల ప్రచారాలకు ఆకర్షితుడై అధిక రసాయనాల వినియోగం వైపు వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతి సీజన్‌లో కొత్త కొత్త మందులు, ఎరువులు అంటూ మార్కెట్‌లోకి వస్తున్న ఉత్పత్తులు రైతును మరింత అప్పుల ఊబిలోకి నెడుతున్నాయని వ్యవసాయ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రైతు మేలుకో**

ఇప్పటికైనా రైతులు తమ పూర్వీకుల అనుభవాలను గుర్తు చేసుకోవాల్సిన సమయం వచ్చింది. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ సాగు, స్థానిక విత్తనాల వినియోగం, పశుసంపద ఆధారిత వ్యవసాయం వంటి పద్ధతులను అనుసరిస్తే నేల సారం పెరగడంతో పాటు ఉత్పత్తి వ్యయం కూడా తగ్గుతుంది. పర్యావరణం పరిరక్షించబడటమే కాకుండా ప్రజలకు విషరహిత ఆహారం అందుతుంది.

**రైతులకు విజ్ఞప్తి**
**పంట వ్యర్థాలను కొయ్యకాళ్ళ ను తగలబెట్టవద్దు**

పొలాల్లో పంట కోత అనంతరం మిగిలే కొయ్యకాళు ళ్ల , పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల భూమి సారవంతం తగ్గడంతో పాటు, నేలలో ఉండే సూక్ష్మ జీవులు నశిస్తాయి. అలాగే గాలి కాలుష్యం పెరిగి పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుంది. పొగ కారణంగా రోడ్లపై ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉంటుంది. కాబట్టి రైతులు కొయ్యకాల్లు, పంట వ్యర్థాలను తగలబెట్టకుండా వాటిని సేంద్రియ ఎరువుగా మార్చడం, మల్చింగ్‌కు ఉపయోగించడం లేదా సహజ వ్యవసాయ పద్ధతుల్లో వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు మంచి దిగుబడులు పొందవచ్చు.

**భవిష్య భవిష్యత్ తరాలకు మంచి నేలను అందిద్దాం**

భూమి మనకు పూర్వీకులు ఇచ్చిన ఆస్తి కాదు... భావితరాల నుంచి తీసుకున్న అప్పు. ఆ అప్పును సారవంతమైన నేల రూపంలో తిరిగి అందించడం మన బాధ్యత. అందుకోసం రైతులు రసాయన వ్యవసాయం నుంచి క్రమంగా బయటపడుతూ ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రైతు మారితేనే వ్యవసాయం మారుతుంది... వ్యవసాయం మారితేనే భూమి బతుకుతుంది... భూమి బతికితేనే భావితరాల భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది.



యానాల వెంకట్ రెడ్డి, రాష్ట్ర కో. ఆర్డినేటర్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్

# ఇకపై ఎంజిఎన్ఆర్ఈజిఏ చరిత్ర... అమల్లోకి వీబీ-జి రామ్ జి పథకం

దేశంలో రెండు దశాబ్దాలుగా గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చరిత్ర జూలై 1,2026 నుంచి అధికారికంగా ముగిసింది.ఇక దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ అనే కొత్త చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలో ్కి తీసుకొచ్చింది.ఈ మార్పుతో గ్రామీణ ప్రజల్లో అనేక సందేహాలు, అపోహలు నెలకొన్నాయి.పాత ఉపాధి హామీ పథకం పూర్తిగా రద్దైందా, కొత్త పథకంలో ఎలాంటి మార్పులు వచ్చాయి అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.2005లో తీసుకొ ్చిన ఎంజిఎన్ఆర్ఈజిఏ చట్టం ప్రకారం ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 100 రోజుల ఉపాధి కల్పించడం ప్రభుత్వ చట్టబద్ధ బాధ్యత. పని ఇవ్వక పోతే నిరుద్యోగ భృతి చెల్లించే నిబంధన కూడా ఇందులో ఉంది.ఈ పథకం ద్వారా చెరువులు, రోడ్లు, కాలువలు, భూసంరక్షణ వంటి గ్రామీణ పనులు జరిగేవి. వీబీ-జి రామ్ జి కొత్త గ్రామీణ ఉపాధి చట్టం. దీని ద్వారా ఉపాధితో పాటు గ్రామీణ జీవనోపాధి, ఉత్పాదక ఆస్తుల సృష్టి, వ్యవ సాయా భివృద్ధిపై కూడా దృష్టి పెట్టాలని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది.రెండు పథకాల మధ్య ప్రధాన తేడా ఉపాధి రోజుల్లో ఉంది. ఎంజిఎన్ఆ ర్ఈజిఏ లో 100 రోజులు ఉంటే వీబీ-జి రామ్ జి లో 125 రోజులు చేశారు. నిధుల భారం విషయంలో ఎంజిఎన్ఆర్ ఈజిఏలో ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ భారం ఎక్కువగా ఉండేది.కొత్త పథకంలో రాష్ట్రాల ఆర్థిక భాగస్వామ్యం పెరిగింది.సాధారణ రాష్ట్రాల్లో 60:40 నిష్పత్తిలో కేంద్రం,రాష్ట్రాలు ఖర్చు భరిస్తాయి.పనుల స్వరూపంలోనూ మార్పు ఉంది.కొత్త పథకంలో వ్యవసాయానికి ఉపయోగపడే ఆస్తుల నిర్మాణం, జీవనోపాధి మెరుగుదల,గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కేంద్రం తెలిపింది.ఇప్పటికే ఉన్న జాబ్ కార్డులు చెల్లుబాటు లోనే ఉంటాయి.కొత్తగా కార్డులు తీసుకోవా ల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న పనులు నిలిచి పోవు. అవే కొత్త చట్టం కింద కొనసాగుతా యి.కొత్త పథకం అమలుపై ప్రజల్లో గందరగోళానికి ప్రధాన కారణాలు ఎంజిఎన్ ఆర్ఈజిఏ పూర్తిగా రద్దు కావడం, మహాత్మా గాంధీ పేరు తొలగించడంపై రాజకీయ చర్చ, రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరగడం, కొత్త నిబంధ నలపై పూర్తి అవగాహన ఇంకా గ్రామీణ ప్రాంతాలకు చేరకపోవడం.కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకారం...ఈ కొత్త చట్టం గ్రామీణ కుటుంబాలకు మరింత ఉపాధి, మెరుగైన జీవనోపాధి,ఉత్పాదక గ్రామీణ ఆస్తుల నిర్మాణం లక్ష్యంగా రూపొందిం చబడింది.జాబ్ కార్డులు, కొనసాగుతున్న పనులు, ఉపాధి హామీలో అంతరాయం ఉండదని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ప్రతిపక్ష పార్టీలు మాత్రం మహాత్మా గాంధీ పేరును తొలగించడం,నిధుల పంపిణీ విధానంలో మార్పులు, రాష్ట్రాలపై అదనపు భారం వంటి అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. కార్మిక సంఘాలు కూడా కొన్ని నిబంధ నలపై ఆందోళనలు వ్యక్తం చేశాయి.కొత్త వీబీ-జి రామ్ జి పథకం వల్ల ఉపాధి హామీ కూలీలకు కొన్ని ప్రయోజనాలు, కొన్ని సవాళ్లు ఉండే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడు తున్నారు. గతంలో ఏడాదికి 100 రోజుల హామీ ఉండగా ఇప్పుడు 125 రోజుల వరకు పెంచారు. దీంతో ఎక్కువ రోజులు పని చేసే అవకాశం ఉంటుంది. కొత్త పథకం కింద రాష్ట్రాల వారీగా కనీస వేతనాలను పెంచుతూ రోజుకు 300 రూపాయల కంటే తక్కువ కాకుండా ప్రభుత్వం ప్రకటించింది. చెరువులు, రహదారులు, నీటి సంరక్షణ, వ్యవసాయా నికి ఉపయోగపడే పనులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దీంతో గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజ నం కలగొచ్చు. ఇప్పటికే జరుగుతున్న పనులు కొత్త పథకం కింద కొనసాగుతాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే కూలీలు కొన్ని ఆందోళనలు కూడా వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ సీజన్‌లో పనులు నిలిపివేసే అవకాశం ఉంది. ఎందుకంటే విత్తనాలు వేసే లేదా కోతల కాలంలో రాష్ట్రాలు గరిష్ఠంగా 60 రోజుల వరకు ఉపాధి పనులను నిలిపివేయవచ్చు. దీనిపై కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర,రాష్ట్రాల నిధుల భాగస్వా మ్యం మారడంతో కొన్ని రాష్ట్రాల్లో నిధుల లభ్యత అమలుపై ప్రభావం చూపుతుందనే అభిప్రాయాలు ఉన్నాయి.125 రోజుల హామీ ప్రకటించినప్పటికీ ప్రతి అర్హ కుటుంబానికి నిజంగా అన్ని రోజులు పని దొరుకుతుందా అనేది అమలుపైనే ఆధారపడి ఉంటుంది. ప్రకటించిన నిబంధనల ప్రకారం చూస్తే ఉపాధి రోజులు పెరగడం,వేతనాలు పెరగడం కూలీ ల కు ప్రధాన లాభాలు.అయితే వ్యవసాయ సీజన్‌లో పనుల విరామం,నిధుల అమలు,రాష్ట్రాల సామర్థ్య ం వంటి అంశాలు కొత్త పథకం విజయాన్ని నిర్ణయి స్తాయి. ఈ పథకం వల్ల కూలీలకు ఎంత మేర ప్రయోజనం కలుగుతుందో రాబోయే నెలల్లో అమలు తీరును బట్టి స్పష్టత వస్తుంది. ఫోటో క్యాప్చరింగ్, డిజిటల్ మానిట రింగ్ విషయంలో కూడా ఆందోళనలు ఉన్నాయి. జియో ట్యాగింగ్,మొబైల్ యాప్ ద్వారా హాజరు నమోదు వంటి నిబంధనలు కొంతమంది కూలీలకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని కార్మిక సంఘాలు, గ్రామీణాభివృద్ధి నిపుణులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్ లేకపోతే ఫోటో అప్‌లోడ్ చేయడం,హాజరునమోదు చేయడం ఆలస్యం కావచ్చు.పని చేసినా డిజిటల్ హాజరు నమోదు కాకపోతే వేతనాల చెల్లింపులో జాప్యం లేదా వివాదాలు రావచ్చు. స్మార్ట్‌ఫోన్ ఆధారిత వ్యవస్థ వల్ల సాంకేతిక పరిజ్ఞానం లేని వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడే అవకాశం ఉంది.కొన్ని చోట్ల ఉదయం, సాయంత్రం నిర్దిష్ట సమయంలో ఫోటో తీసి హాజరు నమోదు చేయాల్సి ఉండటంతో ఆలస్యమైతే హాజరు నమోదు కాకపోవచ్చు. వర్షం,ఎండ వంటి పరిస్థితుల్లో ఫోటోలు తీసేందుకు అదనపు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ డిజిటల్ విధానం ద్వారా నకిలీ జాబ్ కార్డులు,బోగస్ హాజరు,అవినీతిని అరికట్టడం, నిజమైన కూలీలకు నేరుగా ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యం అని చెబుతోంది.డిజిటల్ మానిటరింగ్ వల్ల పారదర్శకత పెరిగే అవకాశం ఉన్నప్పటికీ నెట్‌వర్క్ సమస్యలు,సాంకేతిక ఇబ్బందులు పరిష్కరించక పోతే నిజమైన కూలీలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది.మొత్తంగా వీబీ-జి రామ్ జి ద్వారా ఉపాధి హామీ రోజులు 100 నుంచి 125కు పెరగడం గ్రామీణ కుటుంబాలకు ప్రయోజనకరంగా కనిపిస్తున్నప్పటికీ నిధుల పంపిణీ, అమలు విధానం, రాష్ట్రాల పాత్ర వంటి అంశాలపై చర్చ కొనసా గుతోంది. ఈ కొత్త పథకం గ్రామీణ ఉపాధి వ్యవస్థలో ఎంత మేర మార్పు తీసుకొస్తుందో రానున్న నెలల్లో స్పష్టత రానుంది.

